కథా కౌముది

# నీవేనా..!! సుధ్వారక్

ఆ రోజు గోకులమంతా హడావుడి పడుతోంది. గోకులవాసులంతా తెలవారకముందే లేచి స్నానపానాదులు కానిచ్చి, వాళ్ళకున్న వాటిల్లో మంచి రంగురంగుల దుస్తులు ధరించి, తమనితాము చక్కగ అలంకరించుకొని, తమ బళ్ళను , ఎద్దులను చక్కగ తయారుచేసుకొని, తమ గోవులను కూడా తమతో తీసుకొని బయలుదేరుతున్నారు.

వాళ్ళ కృష్ణుడు చెప్పాడట గోవర్ధనగిరికి పూజ చేయాలి, ఉత్సవం జరపాలని.....

కృష్ణుడు ఏమి చేపితే అదే వాళ్ళకి వేదం.

ఎందుకు? ఏమిటి?ఎలా? అన్న ప్రశ్నలకు వాళ్ళ మదిలో తావే లేదు.

కృష్ణుడు చెప్తాడు, వాళ్ళు మనసా, వాచా, కర్మణా పాటిస్తారంతే. వాళ్ళకి అదే ఆనందం.

వాళ్ళ తనువు, మనసు, ధనము అంతా కృష్ణుడే మరి.

★★★★★★★★★★★★★★★★

" కన్నయ్యా!!తొందరగా తెములు, కాళిందిని తీసుకొని గోవర్ధనగిరికి వెళ్ళు, నీ నేస్తులంతా అక్కడే వుంటారు. నేనూ, మీ అయ్య కాళింది వాళ్ళమ్మనూ, మిగతా ఆవులను తోలుకొని వెళతాము. నువ్వు నీ కాళిందితో కలిసి బయలుదేరు "

" అలాగేనమ్మా!!బయలుదేరుతున్నా. " అన్నాడే గానీ కన్నయ్యకు కాస్త ఏదోలా , కాసింత కినుకగా వుంది.

అమ్మకి, అయ్యకి కృష్ణుడు చెప్పిందే వేదం. తనకి కూడ అంతే.

కృష్ణుడు పుట్టిన రోజులలోనే కన్నయ్య కూడా పెట్టాడు.

యశోదమ్మకు పుట్టిన బిడ్డకు ఒక ముని వచ్చి కృష్ణడని పేరు పెట్టారట. ఆ కృష్ణుని చూసిన వారందరికి తమ వాడనే భావన కలిగేదట. మా కృష్ణుడనే అంటారు గోకులమంతా.

కృష్ణయ్య పేరుకి దగ్గరగా వుండాలని కన్నయ్య అని పేరు పెట్టకున్నారు వాళ్ళమ్మా నాన్న.

కన్నయ్యలో కూడ కృష్ణుడే కనిపిస్తాడు వాళ్ళకి.

సరిగ్గా అదే కన్నయ్య బాధ కూడా, కృష్ణుడెంత నచ్చినా, తన తల్లిదండ్రులకు తాను ముఖ్యం కావలనుకొంటున్నాడు కన్నయ్య. కానీ అలా లేదు. తాను ముందు నిలుచున్నా, తనలో కుడా ఎప్పుడూ కృష్ణుడే కనిపిస్తాడు వాళ్ళకి.

కన్నయ్య విచారంగా క్రొత్తగా పుట్టిన లేగదూడ కాళిందిని నిమురుతూ కూర్చున్నాడు. కన్నుల్లో కన్నీటి మేఘాలు కమ్ముకున్నాయి. కాళింది కూడ కన్నయ్య ఏదో బాధలో వున్నాడన్న విషయం గ్రహించినదై నాలుకతో నాకుతూ ఓదార్పునివ్వడానికి ప్రయత్నిస్తుంది.

గోకులం అంతా జాతర హడావుడిలో మునిగివుంది. కృష్ణయ్య చెప్పాడుగా ...... అంతా గిరి వైపుసాగిపోతున్నారు.

కన్నయ్య అమ్మా ,అయ్యా తట్టా, బుట్టా సర్దుకొని చక్కగ సింగారించుకొని వెళ్లారు.తనని అలంకరించారు కృష్ణయ్య మాదిరిగానే. తనని తయారుచేస్తున్నంతసేపు వాళ్ళిద్దరూ కృష్ణయ్య కబుర్లే......ఆ కృష్ణయ్య అట్లా.... కృష్ణయ్య ఇట్లా.... అంటూ.

అసలు తనను తయారుచేస్తున్నారు గానీ తాను కనపడుతున్నాడా వాళ్ళకి ? అని కన్నయ్య అనుమానం. అమ్మ తనలోని కృష్ణయ్యనే చూస్తుందని, కృష్ణయ్యకే ఈ అలంకారం చేస్తుందని కన్నయ్య అనుమానం.

అసలు గోకులం అంతా అంతే, కృష్ణయ్య... మా కృష్ణయ్య అంటూ మురిసిపోతుంటారు. అలా అని తనకేం ఇబ్బంది లేదు, కృష్ణుడు తనకు కూడ ప్రాణప్రదమైన నేస్తుడే.

వ్రేపల్లె వున్నపుడు తన ఇంటివీ.... ఆటలాటలలో దొంగలించిన వెన్న, మీగడలు తనకు దండిగ కుడిపినవాడే. మరి ఈ బృందావనంలో తోటి గోపబాలురతో కలిసి తాము చల్దులు కట్టుకొని పశులను కాసినవారమే .ఒకరి చేతి ముద్ద, మరొకరు తినినవారమే. వెన్నెల రాత్రులలో దాగుడుమూతలు ఆడినవారమే. కృష్ణయ్యతో రోజంతా ఉండాలన్నా, అలా ఎన్ని రోజులు ఉండాలన్నా తనకి ఇష్టమే.... చాలా ,చాల ఇష్టమే....చాలా సంతోషం కూడానూ.

కానీ అమ్మకు, అయ్యకు తన కన్నా కృష్ణుడే ఎక్కువ ఇష్టం కావటం తనకు నచ్చట్లేదు. తనలో కూడా కృష్ణుడినే చూస్తారు. నిజానికి ఈ గోకులమంతా అంతే .అందరూ అలా వున్నా తనకేం ఫరవాలేదూ. కానీ తన అమ్మా, అయ్యలకు తాను ముఖ్యమవ్వాలి కదా!!

ఇలా సాగుతున్న ఆలోచనలలో, కాళిందిని నిమురుకుంటూ, అమ్మా, అయ్యలు ఎప్పుడు బయలుదేరినది పట్టించుకోలేదు.

కన్నయ్య ఆడుతూ,పాడుతూ తోటి పిల్లలతో కలిసి కాళిందిని తోలుకుంటూ వెళ్ళాడని అనుకొంటున్నారు వాళ్ళమ్మ ,అయ్య . దారంత కృష్ణ కథలే ఆ గోకులవాసుల నోటమ్మట. కళ్ళు పెద్దవి చేస్తూ, చేతులు రకరకాల భంగిమలలో త్రిప్పుతూ, ఒకలాంటి మైకం లో ఆతని చేష్టలు చెప్పుకుంటూ ఆనందంగా వెళుతున్నారు. మరో చింతలేదు వారికి.

కన్నయ్య కూడా వెళ్దామనే , కాళింది దగ్గరకు వచ్చి, తన గోడంతా మౌనంగా కాళిందితో వెళ్ళబోసుకుంటూ వుండిపోయాడు. తన చుట్టుపక్కల గమనించుకోలేదు.

అలా ఎంతసేపు గడిచిందో...

హఠాత్తుగా అంతా నిశ్శబ్దమైపోయింది. నెమ్మదిగా కడుపులో ఆకలి కదలుతుంటే ఈ లోకంలోకి వచ్చాడు కన్నయ్య.

నెమ్మదిగా బయటకి వచ్చి చూసాడు. ఆకాశమంతా పెద్ద పెద్ద ఏనుగుల గుంపులతో నిండిందా అన్నట్టు కరిమబ్బులతో నిండివుంది. పట్టపగలే చీకట్లు ముసురుకున్నాయి .

కాళింది భయంతో అంబారావములు చేయసాగింది. కన్నయ్య కంటిలో నీరు నిండి బయటకు రాసాగింది.

ఎంత పని జరిగింది?, అమ్మ అన్నిసార్లు చెప్పినా తన ఆలోచనలో తాను ఉన్నాడే గానీ, చుట్టూ పరిస్థితులను పట్టించుకోలేదు.ఇప్పుడిక్కడ ఎవ్వరూ లేరు. ఇక తనకేంటి దిక్కు?.

తటాలున తటిల్లత మెరిసింది. వెనువెంటనే ఓ ఉరుము భయంకరముగా గర్జించింది.

" కృష్ణయ్య!!" అంటూ తన ప్రమేయం లేకుండానే ఓ ఆర్తనాదం కన్నయ్య మనసులో వెలువడింది. కన్నయ్యకు కూడా తెలియదది.

పరుగపరుగున వెళ్ళి కాళింది మెడను చుట్టుకున్నాడు కన్నయ్య. కన్నయ్యను గట్టిగా చుట్టుకుంది కాళింది.

కన్నయ్య గుండెల్లో గుబులు వాన. బయట జోరున జడివాన. చుట్టూ చీకటి. గాలి హోరు.

అయ్యో,ఇప్పుడెలా?, తనని కాపాడటానికి ఈ గోకులంలో ఎవ్వరు లేరే? ఇలాంటి సమయంలో మాయయైన, మంత్రమైన చేసే ఉపాయంతో అపాయాన్ని తప్పించగల కృష్ణుడు కూడ ఇక్కడ లేడు. దుఃఖపడుతున్నాడు కన్నయ్య. ఏమీ తోచట్లేదాతనికి.

ఇంతలో........ హరిచందన పరిమళం అలవోకగా కన్నయ్యను తాకింది . వేణుగానమొకటి లీలగా తనవైపే రాసాగింది.

సిరిమువ్వల చిరునాదం తనను సమీపిస్తోంది.

అవును!!! ఇది తన నేస్తుడి ఆనవాలు.

అలా అనుకోగానే కొండంత ధైర్యం వచ్చింది కన్నయ్యకు.

మరోసారి మెరుపు మెరిసింది. ఆ క్షణిక కాంతిలో కన్నయ్యకు తన ముందు తన ఆత్మీయనేస్తం, చెంగలువ పూదండ ధరించి, నడుమున బిగించిన పట్టుదట్టిలో వేణువును పెట్టి తనకోసం చేతులు చాపుతూ కనిపించాడు.

" కృష్ణా!! నీవేనా......నాకోసం వచ్చావా చెలికాడా? "అని తలుస్తూ ఆరాధనగా చూసాడతనికేసి.

"నావాడిని వదలి నేనెట్లుండగలను? " అన్నట్లున్నాయి కృష్ణుడి ప్రేమపూరిత చూపులు.

కాళిందిని తన భుజములపై ఎత్తుకొని, కన్నయ్యను చేతితో పట్టుకొని వేగంగా గోవర్ధనగిరి వైపు సాగిపోతున్నాడు కృష్ణుడు.

వర్షం అంతకంతకు పెద్దదవసాగింది. వాళ్ళు దాటివచ్చిన వేంటనే, ఆ ప్రాంతం మునిగిపోతుందా అన్నట్టున్నాయి, ఆ వాన నీటి పరవళ్ళు.

చాలా తొందరగా తీసుకెళతున్నాడు కృష్ణుడు , తాను తడుస్తున్నా , కన్నయ్యను, కాళిందిని తడవనీయకుండా తీసుకెళుతున్నాడు.

తన నేస్తుడు అబ్బురంగా తోస్తున్నాడు కన్నయ్యకి. కేవలం కృష్ణుని మీదే తన దృష్టి నిలిపి నడుస్తున్నాడు కన్నయ్య.

అలా నడుస్తున్న వారికి, వేణుగానం మరింత దగ్గరవ్వతున్నట్టుగా వుంది.

క్రమక్రమంగా, గిరి దగ్గర అయ్యే క్రొద్ది వేణునాదం, వర్షనాదాన్ని మించి పరిసరములలో ప్రసరించసాగింది.

కొంతదూరంలో గిరి అగుపించసాగింది కన్నయ్యకు. కానీ విచిత్రంగా, ఆకాశంలో గొడుగులా పైకిలేచినట్టుంది.

" కృష్ణా!! అటు చూడు, కొండ పైకి లేచినట్లు అగుపడుతున్నదేం? వర్షం వలనా, ఏమీ?" అడిగాడు కన్నయ్య.

ఎప్పటిలాగే కృష్ణయ్య తన సమ్మోహనమైన చిరునవ్వుతో మాయ చేసాడు కన్నయ్యని.

ఇంతలో గిరికి మరింత చేరువయ్యారు ఇద్దరూ.

ఆశ్చర్యం!!! గిరి నిజంగా పైకి లేచివుంది. దాని క్రింద యావత్ గోకులముంది.

ఏ చీకూ చింత లేకుండా, ఆనందంగా, తమదైన లోకంలో వున్నట్టు, సంతోషంగా, సుఖంగా, బయట వరదతో తమకేమీ పట్టనట్టుగా......

వేవేలుగా వెలుగుతున్న దీపపు కాంతులలో, జాతరకై రంగురంగుల దుస్తులతో అందముగా తయారై, లయబద్ద విన్యాసములో నాట్యము చేస్తూ ఆనందరసానుభూతిలో మునిగివున్నా గోపగోపికలు .

కన్నయ్య కు అది కలో? నిజమో? అర్ధం కావట్లేదు.

బయటహోరు వాన, తుఫాను అలానే వున్నాయి.

గిరి క్రింద గోకులం ఏ చింత లేని ఆనందసాగరంలో మునిగితేలుతున్నది.

గిరి క్రింద ఓ లోకం. గిరి బయట మరోలోకం అన్నట్టు వున్నది.

"ఏమి లోకమిది ?" కన్నయ్య దిగ్ర్భమలో చూస్తున్నాడు.

అక్కడ అందరూ తనవాళ్ళే. తన గోకులవాసులే!!, బృందావనవాసులే...... ఆనందసాగరంలో ఓలలాడుతూ, మధ్యలో నిలచిన వాని చుట్టూ తిరుగుతున్నారు.

మధ్య లో ఎవరూ? ..... నెమలికన్నులా కనిపిస్తుంది.....కృష్ణయ్యా? .....

తన ప్రక్కన చుసాడు, కృష్ణుడు అదే చిరునవ్వుతో చూస్తున్నాడు తనకేసి. నెమ్మదిగా తన చేయి వదిలి, కాళిందిని క్రిందకు దింపి, తన తల్లిని చూపి, అటు వెళ్ళమన్నట్టు వీపు తట్టాడు.

" అంబా!!" అంటూ తడబడతున్న కాళ్లతో తన తల్లి వైపు పరిగెత్తింది కాళింది.

నువ్వూ పదా!!అన్నట్టు కన్నయ్య వీపు నిమిరాడు కృష్ణుడు.

ఇప్పుడు, కన్నయ్యకు ఆదుర్దాగా వుంది.

ఎప్పుడూ కృష్ణయ్య చుట్టూ తిరిగే గోకులవాసులంతా, ఇలా ఎవరిచుట్టూ తిరుగుతూ, పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తున్నారని?

కోపంగా కూడా వుంది, తన కృష్ణుడి కన్నా , తన నేస్తుడి కన్నా, ప్రేమింపబడే వాడేవ్వడు వచ్చాడని? ఈ బృందావనవాసుల ప్రేమామృతమంతా తన నేస్తుడు కృష్ణుడిది. అదీ, ఆతనికే చెందాలి. ఈ క్రొత్తవాడెవ్వరు?....

ఇంతకు ముందున్న కోపమంతా కృష్ణయ్యను చూసిన క్షణానే కరిగిపోయింది.

అమ్మానాన్నలకు తానే ముఖ్యమవ్వాలన్న భావన, ఎపుడో ఇగిరిపోయింది.

ఇప్పుడు తన నేస్తుడు, తన ప్రాణం, తన కృష్ణయ్య, తన ఆత్మ, బృందావనవాసుల ప్రాణం..... శ్రీకృష్ణ దేవుడు......

అలాంటివాని స్థితిని ఆక్రమించడానికి ఎవరు పొడగట్టారు?

తానీ అన్యాయాన్ని భరించలేడు. తనవల్ల కాదు....

కన్నయ్య కంట నీటి చెలమ....నెమ్మదిగా గోపులను తప్పించుకుంటూ మధ్యలోకి దారి తీస్తున్నాడు. అమ్మా, అయ్యలు గుర్తుకురావట్లేదిపుడు.

అందరికి మధ్యలో లీలగా కృష్ణునిలానే గోచరిస్తున్నాడా అతను.

నెమలిపించం ధరించి, కుడిచేతిని వేణువు ధరించి లయబద్ధంగా రాగమాలపిస్తూ, ఎడమచేతిని పైకెత్తి కోనగోటన గిరినిలబెట్టి వున్నాడు.

అందరిని తప్పించుకొని ముందుకు జరుగుతున్నాడు కన్నయ్య. అనేక ఆవరణలుగా ఏర్పడి ఆనందనాట్యమాడుతున్న వారిని దాటుకుంటూ మధ్యలోకి చేరాడు కన్నయ్య.

అక్కడ చేరి, చూసి చకితుడైనాడు. తన కళ్ళను తానే నమ్మలేకున్నాడు. అది..... తన కృష్ణుడే!!!

ఇప్పటి దాక తనను వానలో తడవకుండా, పొదువుకొచ్చిన తన కృష్ణడే!!!

ఒక చేత పిల్లనగ్రోవితో ప్రియరాగాలు పలికిస్తూ , మరోచేత గోవర్దనగిరిని కొనగోట నిల్పి అతిలోకమనోహరమైన చిరునవ్వుమోముతో అమాయకులై, తనను తప్ప అన్యంబెరుగని గోకులవాసులకు, తన లీలతో ఆనందం తప్ప, అన్యమెరుగనీయక అగుపించాడు.

అంతే!!! కన్నయ్య లో ఇప్పటివరకు చెలరేగిన భేదభావాలు, భయాలు అన్ని చప్పున ఆరిపోయాయి. అన్నీ మరచిపోయాడు. తనని తీసుకువచ్చిన కృష్ణయ్య కూడా గుర్తుకురాలేదు.

తెలియని ఆనందరసమొకటి, అతని పరవశింపజేస్తూ, నెమ్మది, నెమ్మదిగా కన్నయ్య హృదయవీదిని ఆక్రమించుకోగా, ఆ గోకులవాసుల ఆనందకేళిలో తానూ చేరిపోయాడు.

★★★★★★★★★★★★★★★★★★★

COMMENTS